# ధర్మాసనం



***అహోధార్ష్ట్యమ సాధూనాం***
***నిందతా మనఘాః స్త్రియః***
***మృష్ణ తామివ చోరాణాం***
***తిష్ఠ చోరేతి జల్పతాం***

**భావం:** పవిత్ర శీలవంతులైన స్త్రీలను నిందించే దుర్మార్గులైన పురుషుల ధార్ష్ట్యాన్ని ఏమనవచ్చును.? దొంగతనం చేసినవాడే 'దొంగా, నిలునిలు అన్నట్టుగా ఉంటుంది.

గ్రామ మధ్యం లో రావిచెట్టు కింద ఎత్తైన అరుగు మీద గ్రామాధికారీ, గ్రామ పెద్దలూ కూచుని ఉన్నారు. పల్లెలోని జనమంతా అరుగుకి దూరంగా నేల మీద కూచుని ఉన్నారు. దీన వదనంతో ఒక మహిళ అరుగుకి దగ్గరగా, నిలబడి ఉంది. ఆమె పక్కన నేలమీద ఆరునెలల పసివాడు పడుకుని

ఉన్నాడు. ఆ మహిళకు ఎదురుగా ఒక మగవాడు కోపంగా ఆమెవైపు చూస్తూ నిల్చున్నాడు.

పంచాయితీ ప్రారంభమైంది. గ్రామాధికారి మగవాడి వైపు చూసి 'నువ్వేం చెప్పుకుంటావో అది చెప్పుకో, వ్యక్తిగత దూషణ పనికి రాదు' అన్నాడు. మగవాడు 'అయ్యలారా, అక్కడ నిలబడ్డది నా భార్య. పేరు సుమతి. పేరుకే సుమతి కానీ అది దుర్మతి...' అంటూ ఉండగా గ్రామాధికారి 'విషయం మాత్రమే చెప్పు' అన్నాడు.

'నా భార్య గర్భవతి అని తెలియగానే మురిసిపోయాను. కానీ పుట్టిన శిశువు మానసిక వికలాంగుడు మాత్రమే కాదు. ఇంతవరకూ కాళ్లూ చేతులూ కూడా కదపలేదు. నా వైద్య మిత్రుడు అటువంటి పిల్లలు సుఖ రోగాలున్న స్త్రీలకే పుడతారని చెప్పాడు. వ్యభిచరించకపోతే రోగమెలా వస్తుంది.? నా భార్యను వదిలెయ్యడానికి అనుమతివ్వండి' అన్నాడు.

గ్రామ వైద్యుణ్ణి సాక్షిగా పిలిచారు. 'వికలాంగులైన పిల్లలు పుట్టడానికి సుఖ రోగాలకీ సంబంధమున్న మాట వాస్తవమే. కానీ ఇతరత్రా కూడా అటువంటి పిల్లలు పుట్టవచ్చు'.

పక్క ఊరి నుంచి వచ్చిన వేశ్య సాక్ష్యం చెప్పింది. 'ఈమె నాకు తెలుసు.మగవారిని వలలో వేసుకుందుకు ఏమేం చెయ్యాలో, ఏ వశీకరణ మందులు వాడాలో నేనే నేర్పించాను. సంసార స్త్రీకి ఈ విషయాలెందుకన్నా వినకుండా నా దగ్గర నేర్చుకుంది. నాకు గురుదక్షిణ కింద రత్నాల హారమిచ్చింది.' 'ఏమ్మా ఈ హారం నీదేనా?' గ్రామాధికారి అడిగాడు. ఆమెతల ఊపింది. కళ్ల నుంచి కన్నీళ్లు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి. గ్రామ పెద్దలు తీర్పు చెప్పడానికి ముందు వారిలో వారు చర్చించుకోసాగారు. ఇంతలో ఒక వృద్ధ స్త్రీ ముందుకు వచ్చింది. 'అయ్యలారా, ఆమె అభాగిని, అబల. ఏ భారతీయ వనితా భర్తకి ఎదురుగా మాట్లాడదు. ఈ మగవాడు ధనవంతుడూ, బలవంతుడూ కనుక ఎవరూ ఆమె వైపు మాట్లాడరు. ముసలిదాన్ని ప్రాణ భయం లేనిదాన్ని. ఆమె వైపు సాక్ష్యం చెప్తాను.' అంది.

గ్రామ పెద్దలు అంగీకరించారు.

'అయ్యలారా! ఈ మగవాడే వ్యభిచారి. పచ్చకామెర్ల రోగికి లోకం పచ్చగా కన్పించినట్లు దుర్మార్గుడికి అందరూ చెడ్డవాళ్లుగా కన్పిస్తారు. ఇతడికి అనుమాన రోగం. భార్యని ఇంట్లో తాళం వేసి ఉంచేవాడు. ఆమెకు రోగం అతని ద్వారానే రావాలి తప్ప ఇంకోలా కాదు'.

గ్రామ పెద్దలు విచారిస్తే ఆ మగవాడు వ్యభిచారి అనీ, వేశ్యకు అతనే భార్య హారాన్ని ఇచ్చాడనీ, వేశ్యను ఉంచుకున్నాడనీ, ఇంకా అనేక స్త్రీలతో సంబంధాలున్నాయనీ తెలిసింది. భర్తకు అబద్ధపు అభియోగానికి శిక్ష వేసి, భార్యను ప్రేమగా చూడకపోతే ఇంకా శిక్ష పడుతుందని హెచ్చరించిన గ్రామాధికారి 'ఏం దుర్మార్గపు పురుషులు నేరం తమదైనా స్త్రీని నిందిస్తారు. తస్కరించిన వాడే 'దొంగ, దొంగ' అని అరిచినట్లుంది' అని గాఢమైన నిట్టూర్పు వదిలాడు.

******